## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: మండలంలోని మల్లెందొడ్డి, మల్దకల్, బూడిదపాడు, బిజ్వారం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

### ఘనంగా రిజర్వేషన్ల దినోత్సవం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా రిజర్వేషన్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దేశంలో అధిక జనాభా ఉన్న బీసీ సామాజిక వర్గానికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భీసన్న, జేమ్స్, ఉసేన్, ఏసురాజు, జమ్మన్న, మధు, ఏసన్న, రాజు ఉన్నారు.

### వీఆర్‌ఏ మృతి

రాజోళి: అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే రాజోళి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ(తలారి) రామకృష్ణ(53) కొన్నేళ్లుగా రాజోళి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతి చెందడంతో తహసీల్దార్ హరికృష్ణ అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన సాయం త్వరగా అందేలా చూస్తామని తెలిపారు.

### వివాహిత అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన నక్కలపల్లి మద్దిలేటికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె ఇందు(19)ను కర్నూల్ జిల్లా తంగడాంచ గ్రామానికి చెందిన రాఘవేంద్రకు ఏప్రిల్ నెలలో ఇచ్చి వివాహం చేశారు. ఆషాఢ మాసం కావడంతో ఆమెను తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకొచ్చారు. ఈ నెల 25న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా ఇందు, మూడో కుమార్తె మానస ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం సమయంలో ఇందు బాత్రూం వెళ్తున్నట్లు చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో మానస తండ్రికి సమాచారం అందించింది. తండ్రి ఇందు కోసం ఆరా తీసినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

### కారును ఢీకొట్టిన రెండు కార్లు

ఉండవెల్లి: అరుణాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఆగి ఉంది. వెనక నుంచి మరో కారు ఢీకొట్టగా, ఆ కారును మరో కారు ఢీకొట్టిన ఘటన శుక్రవారం మండలంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న కారు జాతీయ రహదారిపై ఇటిక్యాలపాడు శివారులోని ఘర్ దాబా సమీపంలో ట్రాఫిక్ జామ్ కావడంతో ఆగింది. కారు ఆగడంతో వెనుక మరో కారు నిలిచింది. ఆగి ఉన్న ముందు కార్లను చూసుకోకుండా మరో కారు ఢీ కొట్టింది. మూడు కార్లకు డ్యామేజ్ కావడంతో పోలీస్ స్టేషన్‌కు కార్లను తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బట్లదిన్నె గ్రామానికి చెందిన అయ్యాలన్న గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి శుక్రవారం బాధితకుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట సురేష్‌బాబు, రవీందర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, లూథరన్న ఉన్నారు.

### రోడ్డుకు మరమ్మతు చేపట్టండి

అయిజ: పట్టణంలో తెలంగాణ చౌరస్తాలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే బీటీ రోడ్డు శిథిలమైంది. మోకాలు లోతు గుంతలు పడి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. వాహనాలు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతినిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు అదేరోడ్డుపై ప్రయాణం చేస్తారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# ఆయిల్ చోరీ.. ట్రాన్స్‌ఫార్మర్లు ఖాళీ

- జాతీయ రహదారి ట్రాన్స్‌ఫార్మర్లపై దొంగల కన్ను
- సరిహద్దులోనే ఆయిల్ చోరీల పర్వం
- ఆయిల్, విద్యుత్ పరికరాలు, వైర్లు మాత్రమే టార్గెట్

ఉండవెల్లి: జాతీయ రహదారిపై వాహనాలు, ఇనుప కడ్డీలు, తదితర వాటిని చోరీ చేసిన ఘటనలు చూశాం. కానీ కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న ఆయిల్‌ను చోరీ చేసి అమ్మకానికి తీసుకెళ్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రైతులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్న యజమానులు వాటిలో ఆయిల్ చోరీ అవుతుండడంతో ఫిర్యాదు చేస్తున్నారు. ఆయిల్ వల్ల ఏమి ఉపయోగాలున్నాయని రైతులు ఆలోచిస్తున్నారు. చోరీ చేస్తున్న వ్యక్తులు, విద్యుత్ వ్యవస్థ గురించి తెలిసిన వాళ్లా? లేక దొంగలేనా, ఇంకెవరైనా ఉన్నారా? అని ఆలోచిస్తున్నారు.

**ఒకే నెలలో మూడు చోరీ కేసులు నమోదు**

పంట పొలాల్లో బోరు ఉన్న ప్రతి రైతు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వాటి కోసం అధికారుల చుట్టూ తిరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతి తెచ్చుకుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అనంతరం ఎండాకాలంలో రైతులు పొలానికి వెళ్లడం తక్కువగా ఉంటుంది. రెండు నెలలు పొలాల వద్దకు వెళ్లకపోవడంతో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్‌ను చోరీ చేసి తీసుకెళ్తున్నారని రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. ఉండవెల్లి మండలంలో 4 కేసులు, మానవపాడు మండలంలో గతంలో ఒకటి, రెండు కేసులు, ఇటిక్యాల మండలంలో 3, 4 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

**చోరీకి యత్నించిన వారు ఎవరు?**

ఇటిక్యాల మండలం నుంచి మానవపాడు మండలం, ఉండవెల్లి మండలానికి జాతీయ రహదారి అటాచ్‌గా ఉంది. దాదాపు 15 గ్రామాలను తాకుతూ సరిహద్దులో పూర్తవుతుంది. దొంగలు ఆయిల్ చోరీ చేసి ఆంధ్రాలో అమ్మేస్తున్నారని కొందరు రైతులు పేర్కొన్నారు. ఆయిల్ కోసం రైతులు విద్యుత్ అధికారులను సంప్రదిస్తే కేస్ ఫైల్ కావాలని తెలపడంతో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులు వెళ్తున్నాయి. పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి చోరీపై విద్యుత్ అధికారులనే సంప్రదిస్తున్నారు. దాదాపు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లలో 200 లీటర్ల ఆయిల్‌ను నింపుతారు. ట్రాన్స్‌ఫార్మర్ ఉపయోగంలో ఉన్నంతవరకు కనీసం 50 లీటర్లు ఆవిరవుతుందని, మిగి తా 150 లీటర్లు దోచుకెళ్తున్నారని రైతులు చెబుతున్నారు. పంట పొలాల్లో, వెంచర్లలో, మిల్లుల్లో, తదితర కంపెనీలనే టార్గెట్‌గా పెట్టుకుని దొంగలు ఆయిల్‌ను దోచేస్తున్నారు.



ఉండవెల్లి శివారు జాతీయ రహదారిలోని పంట పొలంలో ఆయిల్ చోరీ అయిన ట్రాన్స్‌ఫార్మర్



వైర్లు చోరీకి గురైన విద్యుత్ స్తంభం



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

**రెండు సార్లు చోరీ**



మా పొలం జాతీయ రహదారికి అర కిలోమీటర్ దూరంలో ఉంది. బోరు ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాం. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్‌ను దొంగలు చోరీ చేశారు. విద్యుత్ అధికారులను ఆయిల్ అడిగితే కేసు పెట్టి ఫిర్యాదు పత్రం తీసుకొస్తేనే ఆయిల్‌ను ఇస్తామని తెలిపారు. దొంగలను మాత్రం ఇప్పటికి గుర్తించడం లేదు. లక్షలు వెచ్చించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుంటే రైతుల పొలాల్లో ఉన్న ఆయిల్‌ను చోరీ చేయడం చాలా బాధాకరం.

– పిడుగు వెంకటేష్, రైతు, ఉండవెల్లి

**పోలీసులకు సూచనలిచ్చాం..**



రైతుల పంట పొలాల్లో, వెంచర్లలో, ప్రైవేట్ కంపెనీలలో ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీలు అధికమవడం వాస్తవమే. ఫిర్యాదులు వస్తున్నాయి, వాటిని పరిశీలిస్తున్నాం. దొంగలు ఎవరనేది దర్యాప్తు చేస్తున్నాం. వేలల్లో దొంగతనాలు చేస్తున్నారు. రాత్రి సమయంలో కూడా పెట్రోలింగ్ పోలీసులు పరిశీలిస్తున్నారు. త్వరలో పట్టుకుంటాం.

– రవిబాబు, సీఐ, అలంపూర్ డివిజన్

# ప్రతిఒక్కరు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ

కేటీదొడ్డి: వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో శుక్రవారం జెడ్పీ సీఈఓ కాంతమ్మ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాల బాగు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం రైతు వేదికలో మదర్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి బడిబయటి పిల్లలు బడిలో చేర్పించేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ధరూరు: గ్రామంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరి రక్షించాలని పంచాయతీ కార్యదర్శి వసంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబులోనిపల్లిలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెట్లు అంతరించిపోవడం వల్ల వర్షాలు కురవడం తగ్గిపోతుందన్నారు. ఎక్కడైతే చెట్లు ఎక్కువ ఉంటాయో అక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. ప్రాణ వాయువును అందించే చెట్లు ఎంత వీలైతే అంత ఎక్కువగా పెంచాలని కోరారు. ప్రధానంగా రైతులు తమ పొలాల్లో గెట్ల వెంట నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పరశురాం, నాయకులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

అయిజ: పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారిన పడుతారని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి కట్టుగా కృషిచేద్దామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, కమిషనర్ సత్యంబాబు అన్నారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీలోని 16వ వార్డులో డ్రై ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాత్రలలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగన్న, జూనియర్ అసిస్టెంట్ విజయ్, వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: మన చుట్టూ ఉండే ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ భాస్కర్ సూచించారు. మండలంలోని నారాయణపురంలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటిని నిల్వ ఉంచితే దోమలు వృద్ధి చెందుతాయని, దోమల వృద్ధి వల్ల డెంగీ, చికెన్‌గున్యా, వంటి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. డ్రై డే సందర్భంగా పలు కాలనీల్లో నివాసగృహాల్లో నిల్వ ఉన్న నీటిలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని తెలిపారు. నీటిలో దోమల వృద్ధి వల్ల రోగాల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



నారాయణపురంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీఓ భాస్కర్

# రోడ్లపై మురుగు పారితే చర్యలు



తూర్పు గార్లపాడులో నీటి తొట్టెలో నీటిని పారబోస్తున్న ఎంపీఓ ఖాజా

రాజోళి: రోడ్లపై మురుగు పారబోసి, రోడ్లన్నీ బురదమయం చేస్తే దానికి కారకులైన వారిపై చర్యలు తప్పవని ఎంపీఓ ఖాజా మెయినుద్దీన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తూర్పు గార్లపాడులో ఆయన డ్రై డే కార్యక్రమం సందర్భంగా పరిసరాలను పరిశీలించారు. ఆయా కాలనీల్లో ఇళ్ల వద్దకు వెళ్లి మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. నీటి తొట్టెలు, కూలర్లు, కొబ్బరి బోండాలు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల వ్యాధులు ప్రబలుతాయని, ప్రతి శుక్రవారం వాటిని శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని, అందులో ఎలాంటి నాణ్యత లోపించకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలో బోనాల వేడుకలు



బోనాల వేడుకల్లో విద్యార్థులు

గద్వాల: జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బోనాల వేడుకలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక మాంటిస్సోరి స్కూల్, ప్రగతి విద్యానికేతన్, విశ్వభారతి హైస్కూల్, కాకతీయ హైస్కూల్, ఎస్ఆర్ విద్యానికేతన్, విశిష్ట నోబుల్ తదితర పాఠశాలల్లో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగతో పాఠశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్ రవిప్రకాష్‌రెడ్డి ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

# విద్యతోనే ఉన్నతస్థాయికి చేరవచ్చు

గద్వాల: జీవితంలో మనిషిని ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడేది చదువే అని, క్రమశిక్షణ, జిజ్ఞాస, సన్మార్గంలో పయనించే విద్యను ప్రతి ఒక్కరూ నేర్చుకున్నప్పుడే సమాజావృద్ధి జరుగుతుందని ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పీజీ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యను కష్టంగా భావించకూడదని, ఇష్టంగా చదివితే అద్భుతాలు సృష్టిస్తారని సూచించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోవాలన్నారు. సానుకూల దృక్పథాన్ని కలిగి ఉంటే ఆలోచనలు సానుకూలంగా ఉంటాయన్నారు. విద్యార్థులను లక్ష్య సాధనవైపు ప్రోత్సహించాల్సిన బాధ్యత అధ్యాపకులదేనని సూచించారు. సానుకూల దృక్పథంతో ఉంటే ఆలోచన దృక్పథంలో మార్పు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

# ఆన్‌లైన్‌లో పంటల వివరాల నమోదు



మానవపాడులో పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి

మానవపాడు: పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం, చండూరు, మానవపాడు, పెద్దఆముదాలపాడు, అమరవాయి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు రైతులు క్షేత్రస్థాయిలో ఏఏ పంటలు నమోదు చేశారో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌తో పేదలకు ఎలాంటి ఉపయోగం లేదు

శాంతినగర్: తెలంగాణ ప్రభుత్వం గురువారం విడుదల చేసిన బడ్జెట్‌లో నిరుపేదలకు ఎలాంటి ఉపయోగంలేదని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుమలేష్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సులో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బీకే శ్రీను ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు తిరుమలేష్ మాట్లాడుతు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. తరుపు న సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శులు రంగస్వామి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతగా మెలగాలి

ధరూరు: గ్రామాల్లో ప్రతి విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, స్పెషలాఫీసర్ అన్నారు. శుక్రవారం మండలం లోని ర్యాలంపాడులో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో రోగాలు ఎక్కువగా ప్రబ లే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో అందరి భాగస్వామ్యం ఉంటేనే ఏదైనా చేయగలమని, ప్రతి ఒక్కరు గ్రామంలో కలిసి కట్టుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారికి కుంకుమార్చన

గట్టు: మండల కేంద్రంలో భవానీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా భవానీ మాత ఆలయంలో గట్టు గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. భవానీ మాతను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలతో పాటుగా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గట్టులో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

### ఉపాధ్యాయులకు ఘన సన్మానం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ధరూరు: మండలంలోని ర్యాలంపాడు పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ సురేష్‌లు ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న హెచ్ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు శరణప్ప, ఫిలిప్, సుజాతలను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

అయిజ: మండలంలోని యాపదిన్నె పాఠశాల ఉపాధ్యాయులు శివ శంకర్‌రెడ్డి, ప్రభాకర్, లింగారెడ్డి, సురేష్, బాబు, సాజిదా బేగం, వినోద్ కుమార్, పులికల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు హనుమంతు, జమున, పర్వీన్ బేగం, రమేష్ బాబును సన్మానించారు.

మల్దకల్: మండలంలోని మద్దెలబండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు ఏమినా నాయక్, తిమ్మప్ప, చిన్న తిమ్మప్ప, శైలజ, సంగీతలను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం పెద్దదిన్నె పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు హెచ్ఎం ఖరేందర్ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. నాగేశ్వరావు, స్వాములు, అన్వర్‌లకు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవిని దర్శించుకున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి కుంకుమార్చన, పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### ఘనంగా కార్గిల్ విజయ దివస్

గద్వాల: కార్గిల్ యుద్ధంలో దేశానికి విజయాన్ని అందించి అసులువు బాసిన వీరజవాన్లను స్మరిస్తూ శుక్రవారం పలు పాఠశాలల విద్యార్థులు వేర్వేరుగా నివాళులర్పించారు. అమరుల స్థూపాన్ని ఆవిష్కరించి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ విద్యానికేతన్ పాఠశాల డైరెక్టర్ రాముడు మాట్లాడారు. దేశాభిమానం, జాతీయ సమైక్యత పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వినోజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎంపీఓగా బాధ్యతల స్వీకరణ

మానవపాడు: మండలంలో శుక్రవారం ఎంపీఓ భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలో ఎంపీఓగా ఉన్న ఆంజనేయరెడ్డి బదిలీపై ఇటిక్యాల మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

# అఖిలపక్ష కమిటీ నాయకుల నిరసన

అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్-కొత్త బస్టాండ్ మధ్యన పెద్ద వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయని అఖిల పక్షం కమిటీ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అఖిపలక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి సంవత్సరకాలం పూర్తయినా ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదని వాపోయారు. నిర్మాణం పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వెంటనే పనులు పూర్తి చేయకుంటే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు ఆంజనేయులు, విజయభాస్కర్ రెడ్డి, వెంకట్రాముడు, తిరుమలరెడ్డి, తాహేర్ పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణం వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్షం కమిటీ నాయకులు

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామంజనేయులు

కేటీదొడ్డి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులెప్పుడు ప్రజల్లో ఉండాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో రోడ్డు సౌకర్యం, కొత్త పెన్షన్, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డులు, ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు చేయలేదని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి, శ్రీపాదరెడ్డి, అశోక్, దేవేందర్‌రెడ్డి, సాయన్న, ఉన్నారు.

# పథకాలు అందరికీ అందించాలి



ధరూరు: ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పర్సింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద స్థానిక సీఐటీయూ, హమాలీ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నిక ముందు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రధానంగా సామాన్యులకు సొంత ఇళ్లు, రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. వృద్ధులకు పింఛన్ పెంపుపై త్వరగా నిర్ణయం తీసుకుని అందించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పని కల్పించడంతో పాటు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింహులు, గోసి గోవిందు, దేవదాసు, తిమ్మప్ప, ప్రవీణ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.